క్లుప్తంగా

నేడు విశ్వకర్మ జయంతి వేడుకలు

ఒంగోలు వన్‌టౌన్: విశ్వకర్మ జయంతిని ఒంగోలు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ భవనాల సముదాయంలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌లో బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి నిర్మలా జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు మరింత నైపుణ్యం అవసరం



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు

ఒంగోలు టౌన్: విద్యార్థులు చదువులతో పాటు నైపుణ్యం పెంచుకోవాలని.. ఇందుకు వర్క్‌షాపులు ఎంతగానో దోహదపడతాయని క్విస్ విద్యా సంస్థల అధిపతి డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ నిడమానూరి శ్రీగాయత్రి చెప్పారు. మంగళవారం క్విస్ కళాశాలలోని సీఎస్‌ఈ, ఈఈఈ విభాగానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులకు అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేశారు. సీఎస్‌ఈ విద్యార్థులకు టెక్స్ట్ సెర్చింగ్ అంశం గురించి అవగాహన కల్పించారు. లెక్స్, రిజెక్స్ ఇంజిన్లు ఉపయోగించి టెక్స్ట్ ఎలా సెర్చ్ చేయాలన్న విషయం మీద ఆర్జేయూ కేటీ కడపకు చెందిన ప్రొఫెసర్ పెనుగొండ రవికుమార్ సమగ్రంగా వివరించి చెప్పారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఎన్.శ్రీను, ఆర్.మానస పర్యవేక్షించారు. ఆ తరువాత ఆప్టిమల్ సబ్‌స్టేషన్ ప్లానింగ్ అండ్ ఫీడర్ డిజైన్ ఇన్ అర్బన్ అండ్ రూరల్ పవర్ సిస్టమ్స్ అనే అంశం గురించి ఈఈఈ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణ, గ్రామీణ విద్యుత్ వ్యవస్థల్లో సమర్థవంతమైన సబ్ స్టేషన్ ప్రణాళిక, ఫీడర్ రూపకల్పన ప్రాధాన్యతలను పొదిలి ఏపీ ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజినీర్ డి.సుబ్రమణ్యం సులువుగా అర్థమయ్యేలా బోధించారు. కార్యక్రమాన్ని ఈఈఈ హెచ్‌ఓడీ డాక్టర్ మౌళిచంద్ర పర్యవేక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



గెలుపొందిన విద్యార్థులతో కరాటే అసోసియేషన్ నిర్వాహకులు

కొత్తపట్నం: జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కొత్తపట్నం విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బీ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈనెల 15న ఒంగోలులోని డీఆర్‌ఆర్ఎంఎం స్కూల్‌లో అండర్–14, 17 పోటీలు నిర్వహించారన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల నుంచి అండర్–14కు కే.వాసు, కె.గౌతమ్, కే జయశ్రీ, కే వినీత, అండర్–17కు పి.యామిని, ఎం స్మైలీ గ్రేస్ వి.ఆదినారాయణ ఎంపికయ్యారని చెప్పారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో డి.సాయి కిషోర్, బి.భాను ప్రతాప్, ఎస్ కే.ఫయాజ్, హరిబాబు పాల్గొన్నారు.

కరాటే పోటీలకు విద్యార్థుల ఎంపిక..

ఒంగోలు మెట్రో: ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ జిల్లా స్కూల్ గేమ్స్, సెలక్షన్స్ మంగళవారం ఉదయం ఒంగోలు గద్దలగుంట ఓరియంటల్ హై స్కూల్ ఆవరణలో జరిగాయి. అండర్ 14,17,19 బాలబాలికలు 150 మంది కరాటే ఎంపికల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన బాల బాలికలను ప్రకాశం జిల్లా కరాటే అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మార్నెళ్ల సుబ్బారావు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, గేమ్స్ సెక్రటరీ చెక్క వెంకటేశ్వర్లు, మహిళ స్కూల్ గేమ్స్ సెక్రటరీ శిరీష, పీడీ సురేష్ తోపాటు కరాటే పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నల్లూరి మోహన్‌రావు (ఒంగోలు), శ్రీనివాసరెడ్డి (మార్కాపురం), ఎస్డీ శేషావలి (గిద్దలూరు), షేక్ వహీదా (కనిగిరి), బీ వెంకటేశ్వర్లు (కొత్తపట్నం) తదితరులు వ్యవహరించారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



చప్టా పగిలిన చోట జెండా కడుతున్న యువకులు

మద్దిపాడు: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని పెదకొత్తపల్లి గ్రామానికి వెళ్లే ప్రజల ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. వివరాల్లోకి వెళ్తే.. ముదిగొండి వాగుపై వెళ్లే వాహనదారులు జాగ్రత్తగా ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ముదిగొండి వాగుపై చాలా కాలం క్రితం చప్టా నిర్మించారు. కాని ఇటీవల కురిసిన వర్షాలకు చప్టాలో కొంత భాగం వంగి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈనేపథ్యంలో చప్టా మీద చాలా ట్రాక్టర్లు ఇరుక్కుపోయిన ఘటనలు ఉన్నాయి. అంతకాకుండా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు గమనించకపోవడంతో గాయాలపాలైన ఘటనలు చాలా ఉన్నాయి. దీనిని గమనించిన గ్రామ యువకులు ప్రమాదాలను నివారించడానికి చప్టా విరిగిపోయిన చోట జెండాలు కట్టి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేశారు. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరచి చప్టాను బాగు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలను ప్రైవేటుకు ఇవ్వడం దారుణం



పాత కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: నగరంలోని పాత కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం సరైన నిర్ణయం సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం సీపీఎం నాయకులు పాత మార్కెట్‌కు చెందిన 83 సెంట్ల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో జీప్లస్–2 అంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, పీపీపీ విధానంలో ప్రైవేటు సంస్థకు అప్పగించాలని తీర్మానం చేయడం ప్రజల ఆస్తులను హరించడమేనని విమర్శించారు. కోట్లాది రుపాయల ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దారుణమన్నారు. పాత మార్కెట్ స్థలంలో స్వయంగా నగర పాలక సంస్థే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు. పాత మార్కెట్ స్థలంలో గతంలో అనేక మంది కూరగాయలు విక్రయించేవారని, వేలాది కుటుంబాలు ఆధారపడిన ఈ మార్కెట్‌ను ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రైవేటు మాఫియాకు అప్పగించే ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పక్కన ఎంపీపీ

కొత్తపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. మంగళవారం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో ఒక్కో అధికారి గ్రామ సమస్యలు, పథకాలు గురించి చర్చించారు. ఈసందర్భంగా ఎంపీపీ అంజిరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటే కార్యక్రమం సర్పంచ్‌లు తీసుకోవాలని.. దానికి అయ్యే ఖర్చు పెట్టుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్ఎస్పీ కెనాల్ మరమ్మతుల కోసం సర్వే చేసి బాగు చేయాలన్నారు. మండలంలో 1,995 రొయ్యల చెరువులకు గాను ఎంత మంది రైతులకు విద్యుత్ రాయితీ వస్తుంది ?, ఎంత మందికి రావడం లేదన్న ? వివరాలు సేకరించి సబ్సిడీ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర రైతు విభాగం జోనల్ ప్రెసిడెంట్ ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవా చాల మందికి రావడం లేదని.. వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలంలో యూరియా, ఎరువుల కొరత ఉందని అధికారులు గమనించాలని కోరారు. ఎస్ఎస్పీ కెనాల్ అంతా చిల్లచెట్లతో మూసుకుపోయిందని, మరమ్మతులు చేసి నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజుపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఉప్పుటూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ 2014, 2019లో ఆగిపోయిన హౌసింగ్ బిల్లులను వెంటనే వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో యు.శేషుబాబు, ఏవో కిషోర్‌బాబు, వైద్యులు శ్రావ్య, సవ్యారెడ్డి, అమూల్య, ఏఈవో పద్మావతి కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతులు నల్లబర్లీ పొగాకు సాగు చేయరాదు



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

దొనకొండ: రైతులు నల్లబర్లీ పొగాకు సాగు చేసి నష్టపోవద్దని వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ అన్నారు. మండలంలోని రుద్రసముద్రం, మల్లంపేట గ్రామాల్లోని రైతులతో మంగళవారం మాట్లాడారు. రైతులు నల్లబర్లీ పొగాకు సాగు చేయకుండా తెల్లబర్లీ పొగాకును అగ్రిమెంట్ ప్రకారం సాగు చేసుకోవాలని సూచించారు. పొగాకు పంటకు బదులు ఇతర పంటలు వేసుకోవాలన్నారు. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే శాఖాపర చర్యలు తీసుకుంటామని ఏఓ హెచ్చరించారు. వ్యవసాయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకు సాగు నిషేధం

కురిచేడు: నల్లబర్లీ పొగాకు సాగు నిషేధించారని, రైతులు ప్రత్యామ్నాయ పంటలుగా మినుము, మొక్కజొన్న పంటలు సాగు చేయాలని వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని పడమర గంగవరం, పొట్లపాడు గ్రామాల్లో సాగు చేసిన కంది, పొగాకు పంటలను పరిశీలించారు. కంది సాగు చేసే రైతులు 35 నుంచి 40 రోజుల్లో నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతులంతా తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టపోతే నష్టపరిహారం అందుతుందన్నారు. రైతులు అవసరానికి మించి యూరియా వాడవద్దని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు చంద్రకాంత్, మల్లికార్జున్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

కారుమంచి కాల్వ మరమ్మతులు చేపట్టాలి



ఎస్ఎస్పీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఒంగోలు సబర్బన్: నాగార్జునసాగర్ ఒంగోలు బ్రాంచ్ కెనాల్ నుంచి వెళ్లే కారుమంచి కాల్వ మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎస్పీ అధికారులకు మంగళవారం ఏపీ రైతు సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రకాశం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ.. కారుమంచి మేజర్ కాలువ మధుకాన్ గ్రానైట్ క్వారీలోకి 2021లో ఒకపక్క పూర్తిగా జారిపోయిందన్నారు. దాని మూలంగా కింది ప్రాంతంలో 25 వేల ఎకరాలకు నీటి సమస్య ఏర్పడింది. అప్పటి ప్రభుత్వం తాత్కాలికంగా 40 క్యూసెక్కులు నీరు నడిచే విధంగా తాత్కాలిక కాలువ ఏర్పాటు చేశారన్నారు. ఇటీవల కాలువ మరమ్మతులకు రూ. 2.63 లక్షలు మంజూరు చేసినట్టు నేటిపారుదల శాఖ అధికారులు చెప్పారన్నారు. ప్రభుత్వం వెంటనే రైతుల అనుమానాలకు అవకాశం లేకుండా వెంటనే సాంకేతిక పరమైన అనుమతులు మంజూరు చేసి, వెంటనే పనులు ప్రారంభించి కాలువ మరుమత్తు పనులు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే మాబు, జిల్లా సహాయ కార్యదర్శి బెజవాడ శ్రీనివాసరావు, కొల్లూరు వెంకటేశ్వర్లు, మాదాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఎంపిక రేపు



నాగులుప్పలపాడులో పీఈటీల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవోలు



క్రీడా వివరాలు వెల్లడిస్తున్న మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ స్వరూపా వాణి

నాగులుప్పలపాడు: మండలస్థాయిలో నిర్వహించే స్కూల్ గేమ్స్ పోటీలు, ఎంపికలను ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు ఉప్పుగుండూరు జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవోలు రవి, రమణయ్య తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ విభాగాలలో అండర్–14,17 సంవత్సరాల్లోపు బాలబాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

చీమకుర్తి మండలంలో..

చీమకుర్తి: ఈనెల 18, 19 తేదీల్లో చీమకుర్తి మండల స్థాయిలో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు స్కూలు గేమ్స్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ డీ.స్వరూపా వాణి తెలిపారు. మంగళవారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులో ఎంఈఓ–1,2, చీమకుర్తి క్లస్టర్ హెచ్‌ఎం ఎన్‌వీఎస్ కుమార్ ఆధ్వర్యంలో స్కూలు గేమ్స్ ఫెడరేషన్‌లో నిర్వహించాల్సిన పోటీల వివరాలను ఆమె వెల్లడించారు. అండర్–14, 17 బాలబాలికలకు ఈ పోటీలను నిర్వహిస్తారన్నారు. ఈనెల 18న చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా, బాడ్మింటన్, చెస్ పోటీలను నిర్వహిస్తారన్నారు. 19న బండ్లమూడి జిల్లాపరిషత్ హైస్కూలులో అథ్లెటిక్స్ నిర్వహిస్తారన్నారు. ఆయా పోటీలకు మండలంలోని జిల్లాపరిషత్, ప్రభుత్వ, గురుకుల పాఠశాలల విద్యార్థులను పోటీలకు హాజరయ్యే విధంగా సంబంధిత హెచ్‌ఎంలు, పీడీలు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలు హైస్కూళ్ల హెచ్‌ఎంలు భాస్కర్‌శాస్త్రి, పద్మావతి, బండి శ్రీనివాసరావు, ఎన్‌వీఎస్ కుమార్, జీఎస్ఆర్ సాయి పాల్గొన్నారు.

నైపుణ్యం సాధిస్తేనే భవిష్యత్‌లో ఉద్యోగాలు



మాట్లాడుతున్న హైమావతి

దర్శి: డిగ్రీస్థాయిలో నైపుణ్యాలు సాధిస్తేనే భవిష్యత్‌లో ఉద్యోగాల అవకాశాలు ఉంటాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెరియర్ గైడెన్స్ సెల్ డాక్టర్ కె.హైమావతి సూచించారు. స్థానిక కళాశాలలో మంగళవారం విద్యార్థులకు నైపుణ్యాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ నైపుణ్యాలు సాధించే విధానం గురించి వివరించారు. విద్యార్థులకు మరింత సమాచారం కోసం వారు నడుపుతున్న కెరియర్ మైండ్స్ అనే ఒక పోర్టల్ గురించి పిల్లలకు వివరించారు. సీపీడీసీ మెంబర్ జీవీ రత్నం, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభుదాస్, ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ ఏ నగేష్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ జి.వేణు, ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ కె.నరేష్, కెమిస్ట్రీ ఆధ్యాపకులు ఎల్. రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన బాదాపురం చప్టా



చిల్లచెట్లతో నిండి శిథిలావస్థకు చేరిన చప్టా

దొనకొండ: మండలంలోని బాదాపురం, ఎస్సీ కాలనీవాసులు నిత్యం ప్రయాణం సాగించే చప్టా శిథిలావస్థకు చేరింది. ఈ చప్టా నుంచే గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో బాదాపురం ప్రజలు ఎస్సీ కాలనీకి వచ్చేందుకు, ఎస్సీ కాలనీవాసులు బాదాపురం వెళ్లేందానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో నాసిరకంగా చప్టా నిర్మించటంతో నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో ఆ ప్రాంతం అంతా చిల్లచెట్లతో నిండిపోయింది. అంతేకాకుండా నిత్యం వాహనచోదకులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంటుంది. నిత్యం రైతులు ట్రాక్టర్ల ద్వారా పొలాలకు వెళ్లాల్సి వస్తుంది. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో పక్కనే వాగులో నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. వర్షం కురిసిన సమయంలో వాగులో నీరు ప్రవహిస్తుండటంతో ఆ సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని బాదాపురం గ్రామస్తులు, ఎస్సీ కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన చప్టా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

అక్షర ఆంధ్రలో భాగస్వాములు కావాలి



అక్షరాంధ్ర పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు

కురిచేడు: సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ కేజీఎస్ రాజు అన్నారు. వలంటరీ టీచర్ల మండలస్థాయి శిక్షణ కార్యక్రమం మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో రెండో విడతలో 3,045 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే లక్ష్యంతో ఆవులమంద, కల్లూరు, పడమర నాయుడుపాలెం సచివాలయాల కార్యక్రమం నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు వయోజన విద్య పర్యవేక్షకుడు వై. చౌడిరెడ్డి వివరించారు. శిక్షణకు హాజరైన స్వచ్ఛంద ఉపాధ్యాయులకు వయోజన విద్యాశాఖ ద్వారా సరఫరా చేసిన అక్షరాంధ్ర పాఠ్యపుస్తకాలు, వర్ బుక్‌లు పంపిణీ చేశారు. ఏపీఎం సైమన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ–2 సుబ్బారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, ఏపీఓ దేవయ్య, సీసీలు పాల్గొన్నారు.

పెద్దవరాన్ని జల్లెడ పట్టిన వైద్య సిబ్బంది



డ్రైనేజీల్లో ఎబేట్ పిచికారీ చేస్తున్న వైద్యాధికారి సుష్మితరెడ్డి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సుష్మితారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

కురిచేడు: మండలంలోని పెద్దవరంలోని ఇంటింటిని వైద్యసిబ్బంది మంగళవారం పరిశీలించి జ్వరాల సర్వే చేశారు. 'మంచంపట్టిన పెద్దవరం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన వైద్యాధికారి ఉః సుష్మితరెడ్డి తన సిబ్బందితో వెళ్లి వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటి సర్వే చేసి జ్వరపీడితులను గుర్తించి వైద్యచికిత్సలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డ్రైనేజీలో ఎబేట్ పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుష్మితరెడ్డి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల తెరలు వాడాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, నీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. సర్పంచ్ మార్నెళ్ల నరసమ్మతో మాట్లాడి గ్రామంలోని వీధుల్లో బ్లీచింగ్ చల్లించాలని, బావుల్లో క్లోరినేషన్ చేయించాలని సూచించారు. గ్రామంలో ఎవరికి జ్వరం వచ్చినట్లు అనుమానం వచ్చినా ఆరోగ్య ఉపకేంద్రానికి రావాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా అధికారి బసవారెడ్డి, నాయకులు మార్నెళ్ల రామాంజి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.